# కవితా మహేంద్రజాలం

-డా॥ ప్రసాదరాయ కులపతి

కం॥ నరసింహ కృష్ణరాయని
కరమరుదగు కీర్తివెలసె కరిభిత్ గిరిభిత్
కరికరిభిత్ గిరిగిరిభిత్
కరిభిత్ గిరిభిత్ తురంగ కమనీయంబై.

శ్రీకృష్ణరాయలపై తెనాలి రామకృష్ణుడు చెప్పిన ప్రసిద్ధ పద్య మిది. రాయలవారి కీర్తి - కరిభిత్ = శివునిలా [గజాసురుని చంపినవాడు], గిరిభిత్ కరి = ఐరావతంలా, కరిభిత్ గిరి = కైలాసంలా, గిరిభిత్ = వజ్రంలా, కరిభిత్ గిరిభిత్ తురంగ = శివుని, ఇంద్రుని వాహనాలైన నంది, ఐరావతాలలా అందం గా, తెల్లగా ఉంటుందని భావం.

ఇటువంటిదే మరొక చాటుపద్యం చూడండి. [కవి ఎవరో తెలియదు]

కం॥ వరబారు వెంకనార్యుని
ధర నిండిన కీర్తి వెలసె ధరజిత్ పురజిత్
ధర ధరజిత్ పుర పురజిత్
ధరజిత్ పురజిత్ తురంగ ధావళ్యంబై.

బారు వెంకన్న కీర్తి భూమి అంతటా నిండి ప్రకాశించిందట ! ఎలా అంటే - ధరజిత్ = కొండను గెలిచిన వజ్రంలా, పురజిత్ ధర = పురాలను జయించిన శివుని కొండ కైలాసంలా, ధరజిత్ పుర = ఇంద్రుని పురంలా, పురజిత్ = శివునిలా, ధరజిత్ పురజిత్ తురంగ = ఇంద్రుని, శివుని వాహనాలైన ఉచ్చైశ్రవ, నందులలా, ధావళ్యంబై = తెల్లదనం గలదై - అని భావం.

కీర్తిని తెల్లటి వస్తువులతో పోల్చటం సంప్రదాయం. అయితే పోలిక లెప్పుడు ప్రసిద్ధమైనవిగా, గొప్పవిగా ఉండాలి. హీనమైన వస్తువులను పోలికలుగా ఉపయోగించరాదు.

ఎవరో ఒక కవి చమత్కారం కోసం చెప్పిన అపభ్రంశ శ్లోకం చూడండి-

శ్లో॥ అస్థివత్ బకవచ్చైవ
చల్లవత్ తెల్లకుక్కవత్
రాజతే భోజ ! తే కీర్తి !
పునస్సన్యాసిదంతవత్.

భోజ మహారాజా ! నీ కీర్తి ఎముకలలా, కొంగలా, మజ్జిగలా, తెల్లకుక్కలా, మళ్ళీ మాట్లాడితే సన్యాసి పండ్లలా రాజిల్లుచున్నది. దీంట్లో వన్నీ హీనోపమలు. ఇటువంటివి వాడకూడదు. స్త్రీ ముఖంగుండ్రంగా ఉంటే చంద్రబింబముతో పోల్చాలే కాని బండి చక్రంతో పోల్చకూడదు. పల్లవి ముఖం పద్మంలా ఉందనవచ్చు గాని సుబ్బమ్మ ముఖం సిబ్బిరేకులా ఉందనకూడదు. కవిత్వంలో ఉన్న సంప్రదాయాలు, కవి సమయాలు గుర్తించి రచన చేయాలి.

# పూర్ మెమొరీ

దువ్వూరి రాజారెడ్డి

బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ లోపలికి దూసుకు వచ్చిం దో మారుతీ కారు. అందులోంచి దిగా డో ఖరీదైన వ్యక్తి.

"ఎస్.ఐ. గారున్నారా?" అడిగాడు బయట నిలబడి ఉన్న సెంట్రీతో.

"ఊ, లోపల కూర్చుంఢ్రు."

"గుడ్ మార్నింగ్ సర్"

"గుడ్ మార్నింగ్. వా టీస్ ద మాటర్?" అడిగాడు ఎస్.ఐ. రజాక్.

"మా ఆవిడ నాలుగు రోజుల నుంచి కనిపించడం లేదండీ."

"అలాగా. కంప్లెయింట్ రా సివ్వండి."

"ఇదిగో, ముందే రాసి తెచ్చాను." జేబులో నుంచి పేపర్ తీసి అందించాడు. అందుకుని "చూడండి..." మధ్యలో ఆగాడు ఎస్.ఐ.

"సి.వి. రావ్" తన పేరు అందించా డా వ్యక్తి.

"ఆ, చూడండి సి.పి. రావ్‌గారూ! ఇందులో మీ ఆవిడ గురించిన వివరా లేమీ రాసి లేవు... డీటెయిల్స్ చెప్పండి నోట్ చేసుకుంటాను." పెన్ అందుకున్నాడు.

"మీ ఆవిడ హైట్ ఎం తుంటుంది?"

"అయి దడుగుల నుంచి అయిదున్నర వరకూ ఉండవచ్చు."

"రంగు?"

"మీడియం కాంప్లెక్షన్‌కి కొంచెం అటూ ఇటూగా ఉంటుంది."

"పుట్టుమచ్చలు గానీ, ప్రత్యేకమైన గుర్తులు గానీ ఏమైనా చెప్పగలరా?"

"సారీ సర్, ఐ గాట్ వెరీ పూర్ మెమొరీ."

"పోనీ ఆమె ఏ రంగు చీర కట్టుకుందో చెప్పండి."

"క్షమించండి, నాకు చాలా విషయాలు అసలు గుర్తుండవు."

అతని సమాధానాలతో విసిగిపోయిన ఎస్.ఐ, "తనతో ఎవరినైనా తీసుకెళ్ళిందా?" అని అడిగాడు.

"ఊ, మా పప్పీని తీసుకెళ్ళింది." ఇమీడియట్‌గా చెప్పాడు.

"పప్పీ అంటే?"

"మా డార్లింగ్ డాగ్."

"ఓ... కుక్కా ? ఎలా ఉంటుంది?"

"ఇటీస్ పెడిగ్రీడ్ వైట్ పామరేనియన్. అబౌట్ ఎయిట్ కేజీస్ వెయిట్, ఇరవై వే ళ్ళుంటాయి, కుడి చెవి కొద్దిగా వినిపించదు, ఎడమ చెవి లోపల నల్లటి మచ్చ ఉంటుంది. మెడలో బ్రౌన్ బెల్ట్. లైసెన్స్ నంబర్ ఎం.సి.హెచ్ - డి.ఎల్ - ఫోర్, జీరో - ట్వెంటీ త్రీ - సిక్స్ సెవెన్టీ నైన్, ఎయిటీ ఫోర్" ఆపకుండా చెప్తున్నా డా వ్యక్తి.